క్లుప్తంగా

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ



గుడివాడ టౌన్(నందివాడ): ఇటీవల వచ్చిన ఈదురు గాలులకు ఒరిగిన విద్యుత్ స్తంభాలను తిరిగి యథాస్థానానికి తీసుకువస్తున్నట్లు నందివాడ ఎలక్ట్రికల్ ఏఈ టి.ఫణీంద్ర తెలిపారు. గాలుల కారణంగా మండలంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగాయని తొలుత ప్రమాదకరంగా ఉన్న వాటిని తిరిగి యథాస్థితిలోకి తీసుకువస్తున్నామని తెలిపారు. గురువారం మండలంలోని కుదరవల్లిలో ఒరిగిపోయిన 15 స్తంభాలు తిరిగి నిలబెట్టామన్నారు. ఇతర గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్ సీహెచ్ బోస్‌బాబు, వసంతుల కృష్ణ, గుజ్జుల లాజరు, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థులకు బెల్టు టెస్టులు



పామర్రు(పమిడిముక్కల): తాడంకి గ్రామంలోని ఎస్ఎంకే స్కూల్లో గురువారం కరాటే బెల్టు టెస్టులు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ జె.ధనలక్ష్మి, ఉయ్యూరు ఫైర్ ఆఫీసర్ రవితేజ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు కరాటేతో ఆత్మరక్షణ కలుగుతుందన్నారు. కరాటే ఏపీ టెక్నికల్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన విద్యార్థులకు కరాటే పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. వీరికి శిక్షణ ఇచ్చిన కరాటే కోచ్ రామకృష్ణను ముఖ్య అతిథులతోపాటు ఎస్ఎంకే స్కూల్ ప్రిన్సిపాల్ ఎంకే బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

కాగడాలతో ప్రదర్శన



పామర్రు: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరు మారాలని కోరుతూ గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పెదపూడి దిలీప్‌కుమార్, పిట్లు శ్రీనివాసరావు, వల్లభనేని చెన్నయ్య, టీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హజరత్ ఇమామ్ అలీ వర్ధంతి



పామర్రు: హజరత్ అలీ వర్ధంతి సందర్భంగా అలీనఖీపాలెంలో గురువారం పీర్లను ఊరేగించి చెస్ట్ బీటింగ్ చేశారు. హజరత్ ఇమామ్ అలీ వర్ధంతి సందర్భంగా గదిర్ సొసైటీ ఆధ్వర్యాన వర్ధంతి జరిగింది. కార్యక్రమంలో మౌలానా సయ్యద్ మోసిస్, రజా సాహెబ్ ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు సాజిద్ అలీ, కార్యదర్శి హుస్సేన్ అలీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



నిడుమోలు(మొవ్వ): మండలంలోని నిడుమోలు గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. నిడుమోలు గ్రామానికి చెందిన పంది నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసరావు మచిలీపట్నానికి చెందిన నక్షత్ర దంత వైద్యశాల, పీఎస్ఆర్ ట్రస్ట్‌ల సహకారంతో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు కొమ్మా అమల లీలారమణి, డొమ్మా బాల సాయితేజ.. గ్రామ పరిసరాలకు చెందిన 200 మంది పైగా రోగులకు ఉచిత వైద్యసేవ లందించి, మందులు పంపిణీ చేశారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

మహిళలకు ఆర్థిక భరోసా

నియోజకవర్గంలో మూడు విడతల్లో రూ.101.81 కోట్ల రుణమాఫీ



గుడివాడలో మూడో విడత ఆసరా నమూనా చెక్కులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గుడివాడరూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా మూడో విడత డ్వాక్రా రుణమాఫీ చేసి మరోసారి మహిళా పక్షపాతిగా నిలిచారు. గుడివాడ నియోజకవర్గంలో మూడు విడతలుగా 11,469 గ్రూపుల్లోని 1,11,889మంది సభ్యులకు రూ.101.81కోట్ల డ్వాక్రా రుణాల మాఫీ చేసి మాట తప్పని నేతగా పేరొందారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలకు నాటి ప్రభుత్వం పసుపు, కుంకుమ పేరిట ఒక్కో గ్రూపునకు రూ.10 వేలు చొప్పున ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో డ్వాక్రా మహిళలకు ఒరిగింది శూన్యం. అప్పటి ప్రభుత్వ హయాంలో వడ్డీతో సహా రుణాలు కట్టడానికి డ్వాక్రా మహిళలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పాదయాత్రలో భాగంగా డ్వాక్రా మహిళల సమస్యలను తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే అప్పటి వరకు రుణాలు తీసుకున్న వారికి నాలుగు విడత లుగా తీసుకున్న రుణాల మొత్తా లను మాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. దీన్ని 3 విడతల్లో డ్వాక్రా మహిళల ఖాతాల్లో నగదు జమ చేసి వారికి మహిళలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలబడ్డారు.

రుణ భరోసా

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు డ్వాక్రా సంఘాలకు బ్యాంక్‌ల నుంచి ఒక్కో గ్రూపునకు రూ.3లక్షల నుంచి రూ.4లక్షల మేర రుణాలను మంజూరు చేసేవాళ్లు. డ్వాక్రా మహిళలు రుణాలను తీర్చడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవాళ్లు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీ చేయడంతో డ్వాక్రా మహిళలకు బ్యాంక్‌ల నుంచి ఆర్థిక భరోసా ఎక్కువైంది. డ్వాక్రా మహిళలు వివిధ వ్యాపారాలు నిర్వహిస్తూ బ్యాంక్‌లకు సకాలంలో రుణాలు చెల్లించడంతో ఒక్కో గ్రూపునకు గరిష్ఠంగా రూ.20 లక్షల మేర రుణాలు బ్యాంక్‌లు ఇస్తున్నాయి. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తూ కుటుంబ పోషణలో పురుషులతో సమానంగా నిలిచారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగనన్న



జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న. మూడో విడత రుణమాఫీని డ్వాక్రా మహిళల ఖాతాలో జమ చేయడం హర్షణీయం. గత ప్రభుత్వాలు చేయలేని పనులు వైఎస్సార్ సీపీ చేసింది.

–హనుమంతు శివమ్మ, డ్వాక్రా మహిళ, ఎల్ఎస్ పురం, నందివాడ

మహిళల పక్షపాతి జగన్



వైఎస్సార్ మాదిరిగానే ఆ తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళల పక్షపాతిగా నిలిచారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ డ్వాక్రా మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి డ్వాక్రా మహిళలు అండగా ఉంటాం.

–జుజ్జవరపు కోటేశ్వరమ్మ, డ్వాక్రా మహిళ తటివర్రు, గుడివాడ

గుడివాడ నియోజకవర్గానికి సంబంధించి మూడు విడతల రుణమాఫీ మండలాల వారీగా వివరాలు ఇలా..

మొదటి విడత 2020-21				రెండవ విడత 2021-22				మూడో విడత 2022-23			
మండలం	గ్రూపులు	సభ్యులు	నగదు	మండలం	గ్రూపులు	సభ్యులు	నగదు	మండలం	గ్రూపులు	సభ్యులు	నగదు
గుడివాడఅర్బన్	1354	12,643	11.73కోట్లు	గుడివాడఅర్బన్	1354	12,643	11.73కోట్లు	గుడివాడ అర్బన్	1365	12,765	11.77కోట్లు
గుడివాడరూరల్	697	7,100	5.62కోట్లు	గుడివాడరూరల్	698	6,932	5.65కోట్లు	గుడివాడరూరల్	698	6,932	5.62కోట్లు
గుడ్లవల్లేరు	979	9,959	9.77కోట్లు	గుడ్లవల్లేరు	975	9,589	9.77కోట్లు	గుడ్లవల్లేరు	974	9,577	9.77కోట్లు
నందివాడ	795	8,043	6.80కోట్లు	నందివాడ	790	7,853	6.79కోట్లు	నందివాడ	790	7,853	6.79కోట్లు

మొత్తం గ్రూపులు : 11,469 సభ్యులు : 1,11,889 నగదు :101.81కోట్లు

వైఎస్ విగ్రహావిష్కరణ



ముదినేపల్లి రూరల్: మండలంలోని దేవపూడిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) గురువారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన వైఎస్సార్ అభిమాని చలమలశెట్టి బాలాజీ ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, స్థానిక సొసైటీ అధ్యక్షుడు కట్టా మహేష్, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు బొర్రా శేషుబాబు, కోమటి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బస్ నుంచి జారిపడిన విద్యార్థినికి గాయాలు

మండవల్లి: పదో తరగతి పరీక్ష రాసి ఇంటికి బయలుదేరిన విద్యార్థిని బస్సు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో తీవ్రగాయాలైన ఘటన గురువారం మండవల్లిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మండలంలోని పెరికెగూడెం గ్రామానికి చెందిన ఆర్.సౌమ్య మండవల్లి హైస్కూల్లో పదో తరగతి పరీక్షలు రాస్తోంది. హైస్కూలులో పరీక్ష రాసి ఇంటికి వెళ్లడానికి ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి పడిపోయింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో కైకలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జగనన్నతోనే సుస్థిర పాలన

మండవల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని ప్రజలు తమ బిడ్డగా భావించి ఆశీర్వదిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఆరో రోజు గురువారం ఆనందోత్సాహాల నడుమ కొనసాగింది. పులపర్రు, చింతపాడు, మణుగునూరులో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ వెంకటరమణ పాల్గొని ఇంటింటికీ వెళ్లారు. గత టీడీపీ సర్కారుకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పాలనలో ఉన్న తేడాను ప్రజలకు వివరించారు. యజమానుల అనుమతితో గోడపై నువ్వే మా నమ్మకం జగన్ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో ఎంపీపీ జేసీఎస్ కన్వీనర్ పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్(రాము), నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ మాదు శివరామకృష్ణ, సర్పంచ్‌లు వేంద్ర నాగరాజు, మొగనాటి తులసీరత్నం, ఎంపీటీసీ సభ్యుడు దారం రమేష్, పీఏసీఎస్ అధ్యక్షులు పూల హరిబాబు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు భలే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పులపర్రులో జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు'లో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, పార్టీ పరిశీలకుడు శివరామకృష్ణ

గుడివాడరూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైస్ ఎంపీపీ గుంజా వంశీధర్ పేర్కొన్నారు. మండలంలోని తటివర్రులో నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలోఆయన గురువారం ఇంటింటికీ తిరిగి ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఆయా ఇళ్లకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు. శేరీదింటకుర్రు, చిన ఎరుకపాడు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి వారి ఆమోదంతోనే సీఎం స్టిక్కర్‌ను అతికించారు.

తాడంకిలో '..

పామర్రు(పమిడిముక్కల): తాడంకి గ్రామంలో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ యేసుగ వెంకటరమణకుమార్, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ కూచిపూడి శ్రీలక్ష్మి పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల అభిప్రాయాలను సేకరించి వాటిని నమోదు చేశారు. ఇంటి యజమానుల అనుమతితో వారి ఇంటి వద్ద, సెల్‌ఫోన్‌లపై జగన్ స్టిక్కర్లను అంటించారు. ఈనేపథ్యంలో గ్రామానికి చెందిన కూచిపూడి బ్రహ్మం అనే దివ్యాంగుడు తన ఇంటి వద్ద సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్‌ను తానే అతికించుకుని జగన్‌పై ఉన్న ప్రేమను చూపించారు.



తన ఇంటిపై జగనన్న స్టిక్కర్‌ను అతికిస్తున్న దివ్యాంగుడు కూచిపూడి బ్రహ్మం

ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వార్డు సభ్యులు, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పాలనలో వ్యత్యాసాన్ని చూడండి

ముదినేపల్లి రూరల్: గత టీడీపీ ప్రభుత్వ పాలనకు ప్రస్తుత జగనన్న పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని చూసి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. మండలంలోని ఊటుకూరు, వణుదుర్రు, దేవపూడి, వైవాక, వాడవల్లి గ్రామాల్లో గురువారం జరిగిన 'జగనన్నే మా భవిష్యత్తు- మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, మండల జేసీఎస్ కన్వీనర్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, దేవపూడి సొసైటీ అధ్యక్షుడు కట్టా మహేష్, వణుదుర్రు ఎంపీటీసీ సభ్యుడు గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం

ఈదులమద్దాలి(పెదపారుపూడి): ఈదులమద్దాలి ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం వారికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఎంపీపీ గోగం సురేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాడు-నేడు పాటకు విద్యార్థులు చేసిన డ్యాన్స్ అలరించింది. విద్యార్థులు చేసిన రుద్రమదేవి, మాయల ఫకీరు,అల్లూరి సీతారామరాజు వంటి ఏక పాత్రాభినయాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటే మంచి భవిష్యత్‌కు పునాదిగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పానుగుమాటి రజని, సర్పంచ్ వంగర హిమబిందు, హెచ్ఎం వీవీ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్పీ మేరీ ప్రశాంతిని కలిసిన సీఐ



ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతితో సీఐ నాగరాజు, ఎస్సై జ్యోతిబసు

కైకలూరు: ఏలూరు ఎస్పీ మేరీ ప్రశాంతిని కైకలూరు సీఐ ఎంవీఎస్ నాగరాజు, ఎస్సై జ్యోతిబసు ఏలూరు ఎస్పీ కార్యాలయం వద్ద గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీగా విధులు చేపట్టడంతో ఆమెకు పూల మొక్కను అందించి, పట్టణ పరిధిలోని స్టేషన్ వివరాలను తెలియజేశారు .

మట్టి సారవంతంగా ఉంటేనే దిగుబడి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఎం.విజయభారతి

గుడివాడరూరల్: మట్టి సారవంతంగా ఉంటేనే దిగుబడి బాగుంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎం.విజయభారతి అన్నారు. లింగవరం రైతుభరోసా కేంద్రంలో మట్టి నమూనాల సేకరణ, మట్టి పరీక్షల ప్రాముఖ్యతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు మట్టి నమూనాల సేకరణపై అవగాహన ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు మట్టి సారవంతం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డీడీఏ కె.జ్యోతిరమణి, ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, జిల్లా వనరుల వ్యవసాయ అధికారి పద్మజ, మండల వ్యవసాయశాఖ అధికారిణి బి.అనంతలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు భూసార పరీక్ష శిక్షణ తరగతులు నిర్వాహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్ తెలిపారు. గురువారం నందివాడ మండలం ఒద్దులమెరకలో తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ ముగిసిన అనంతరం వ్యవసాయ సహాయకులు రైతు భరోసా కేంద్రాల పరిధిలోని గ్రామ గ్రామాన పరీక్షలు చేస్తారన్నారు.

పామర్రు(తోట్లవల్లూరు): నేల ఆరోగ్యం గురించిన వివరాలు తెలుసుకునేందుకు మట్టినమూనాలు ఉపయుక్తమవుతాయని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. తోట్లవల్లూరు-1 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో మట్టి నమూనాల పరీక్షల వారోత్సవాల సందర్భంగా మండల స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిధిలోని ఆర్‌బీకేల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ జయంతి వేడుకల్లో విద్యార్థులు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో అంబేడ్కర్ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎ.రామ్మోహనరావు ఆధ్వర్యాన అంబేడ్కర్ జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన, డ్రాయింగ్, డిబేట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ జీవితచరిత్ర, రాజకీయ నేపథ్యం రాజ్యాంగ రచనలను విద్యార్థులకు వివరించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు కె.ఆంజేయప్రసాద్, పి.సామ్రాజ్యం, కె.లక్ష్మీపాప, జి.సుజాత, జేవీఎస్ శాస్త్రి, సీఆర్పీ సంగీతరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

మండవల్లి: కొవ్వాడలంక గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను కూలీలు ముమ్మరంగా చేస్తున్నారు. మంచినీటి చెరువుకు వెళ్లే బోదె పనులను గురువారం ఉపాధి కూలీలు చేశారు. ఎంటీఏ నవీన్ మాట్లాడుతూ రూ. 2.20 లక్షల నిధులతో 92 మంది కూలీలు పనులను చేసినట్లు పేర్కొన్నారు.

పెదపారుపూడి: మండలంలోని 19 గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఉపాధి హామీ ఎంపీఓ స్ఫూర్తి తెలిపారు. ఎంపీఓ మాట్లాడుతూ మండలంలోని మోపర్రు, మహేశ్వరపురం గ్రామాల్లోని పంచాయతీ చెరువుల్లో ఉపాధి పనులు కొన్ని రోజులుగా జరుగుతున్నాయన్నారు. వెంట్రప్రగడ, మహేశ్వరపురం, గుర్విందగుంట, వానపాముల, పెదపారుపూడి, యలమర్రు తదితర గ్రామాల్లో పంట బోదెల త్వవకం పనులు జరుగుతున్నట్లు తెలిపారు. మొత్తం 1536 మంది కూలీలు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రామ సభలు

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.మల్లీశ్వరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 14న అయ్యవారి రుద్రవరం, చింతలపూడి, చింతపాడు, కొర్లపాడు, పెనుమాకలంక, తక్కెళ్లపాడు గ్రామాల్లో, 17న అప్పాపురం, గన్నవరం, కొవ్వాడలంక, నందిగామలంక, ప్రత్తిపాడు, పుట్లచెరువు గ్రామ పంచాయతీల్లో, 18న ఇంగిలిపాకలంక, లోకుమూడి, మణుగునూరు, మొఖాసాకలవపూడి, పులపర్రు, సింగనపూడి గ్రామాల్లో, 19న చావలిపాడు, లింగాల, మూడుతాళ్లపాడు, ఉనికిలి గ్రామాల్లో, 20న అల్లినగరం, మండవల్లి గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ముదినేపల్లి రూరల్: మండలంలో శుక్రవారం నుంచి 20 వరకూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.మల్లీశ్వరి గురువారం తెలిపారు. గ్రామసభల్లో భాగంగా 14న అల్లూరు, బొమ్మినంపాడు, చిగురుకోట, చినపాలపర్రు, దాకరం, ముదినేపల్లి, పెయ్యేరు, పెదపాలపర్రు పంచాయతీల్లోనూ 15న చినకామనపూడి, దేవపూడి, కోడూరు, కోమర్రు, కొర్రగుంటపాలెం, ములకలపల్లి, పేరూరు 17న చేవూరు, ఈడేపల్లి, గురజ, కాకరవాడ, పెదకామనపూడి, ప్రొద్దువాక 18న పెదగొన్నూరు, పెనుమల్లి, సింగరాయపాలెం, శ్రీహరిపురం, వడాలి, వాడవల్లి, 19న సంఘర్షణపురం, ఊటుకూరు, విరావిగుంట, వైవాక 20న వణుదుర్రు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

నేడు మండవల్లిలో అంబేడ్కర్ జయంతి

మండవల్లి: మండవల్లి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ జయంతి వేడుకను శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండవల్లి బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు గురువారం ఒక ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ పాల్గొంటారని పేర్కొన్నారు.